క్లుప్తంగా

సాయుధ దళాల పతాకనిధికి రూ.3 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

తిరుపతి అర్బన్: మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సాయం అందించేందకు గాను సాయుధ దళాల పతాక నిధికి తిరుపతి జిల్లా ఉపాధి హామీ పథకం సిబ్బంది రూ.3,05,353 విరాళంగా ఇచ్చారు. వారు బుధవారం చెక్కును కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి విజయ శంకర్‌రెడ్డికి అందజేశారు. డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

ఆలయాలకు మైక్‌సెట్లు వితరణ



ఆలయాలకు మైక్‌సెట్లు అందజేస్తున్న గుండ్రాజు లక్ష్మిదేవి, శివశంకర్‌రాజు

తిరుపతి మంగళం: హిందూ ధర్మ ప్రచారానికి టీటీడీ సహకారంతో, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్టు బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మిదేవి తెలిపారు. ఆమె బుధవారం తిరుమల నగర్ పంచాయతీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్ రాజు ఆధ్వర్యంలో గంగాదేవి ఎస్టీకాలనీ, చెంచులక్ష్మి యానాది కాలనీలలోని గంగమ్మ ఆలయాలకు మైక్‌సెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుమల ప్రసాద్, పార్టీ నాయకులు శ్రావణ్, నాగరాజు, వార్డు మెంబర్లు భారతి, రాము, మణి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడికి సత్కారం



చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న ఉపేంద్రరెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి రూరల్: వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ వింగ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చెన్నకేశవరెడ్డిని బుధవారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నేతలు ఘనంగా సత్కరించారు. ఆయనను పాకాలలోని స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, అజయ్‌కుమార్ రెడ్డి, మస్తాన్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

20 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహనం, 21న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహన సేవలు చేపడతారు. 22న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 23న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 24న పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 25వ తేదీన హనుమంత వాహనం, గజవాహనం, 26న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలు, 27న రథోత్సవం, అశ్వవాహనం సేవలు ఉంటాయి. 28న ఉదయం చక్రస్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

తిరుమలలో విజిబుల్ పోలీసింగ్



విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న సీఐ చంద్రశేఖర్

తిరుమల: తిరుమలలో బుధవారం టూ టౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజిబుల్ పోలీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని నో పార్కింగ్ జోన్, షాపింగ్ కాంప్లెక్స్, హెచ్‌డీ కాంప్లెక్స్, రాంభగీచా వద్ద ఉన్న వాహనాలకు జరిమానా విధించారు. తిరుమలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

శ్రీకాళహస్తి - చైన్నైకి బస్సు చార్జీలు తగ్గింపు

శ్రీకాళహస్తి రూరల్: చెన్నై నుంచి శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి నుంచి చెన్నై వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు తగ్గించినట్టు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి చెన్నైకి బస్సుల్లో ఇంతకుముపు రూ.155ల చార్జీ ఉండగా ఇప్పుడు రూ.135లకు తగ్గించినట్లు పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్ సర్వీసు బస్సులో రూ.185 ఉండగా ఇప్పుడు రూ.165కి తగ్గించినట్లు వివరించారు.

ఉపాధితో ఊతం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- కోరిన వారందరికీ పనులు
- రానున్న వార్షిక సంవత్సరానికి ప్రణాళిక పూర్తి
- 1,685 పనులకు గ్రీన్ సిగ్నల్
- రైతు పొలాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

ఎర్రావారిపాళెం: వలసలను నివారిస్తూ స్థానికంగానే కూలీలు వ్యవసాయంతో పాటు ఉపాధి పనులు చేసుకుని జీవనం సాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే బీడు భూమిని సాగులోకి తీసుకువచ్చేందుకు ఉపాధి హామీలో అవకాశం కల్పించి రైతులను ఆదుకుంటోంది. తద్వారా బెంగళూరు, తిరుపతి తదితర నగరాలకు పనుల కోసం వెళ్లే వారి సంఖ్య తగ్గింది. రైతులు కూడా తమ భూములను అభివృద్ధి చేసుకుంటూ జీవన ప్రమాణాలు పెంచుకుంటున్నారు.

2022–23లో రూ.9 కోట్లతో పనులు

మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం రూ.9 కోట్లతో పనులు చేపట్టింది. కోరిన ప్రతి కూలీకి పని కల్పించింది. గడవు ముగుస్తున్న వార్షిక సంవత్సరంలో ఇప్పటి దాకా 656 పనిదినాలు పూర్తయ్యాయి. జగనన్న కాలనీలు, ప్రభుత్వ భవనాలు, హార్టికల్చర్ ప్లాంటేషన్, రైతు పొలాల్లో అభివృద్ధి పనులు, కాలువల పూడిక తీత, పొలం చుట్టూ కందకాలు వంటి పనులు చేపట్టారు. తద్వారా 5253 మంది కూలీలు, 335 మంది రైతులు లబ్ధిపొందారు.

3.34 లక్షల పనిదినాలు లక్ష్యం

2023–24లో అధికారులు ఇప్పటికే ప్రణాళికలు పూర్తి చేశారు. మండలంలో 6,998 జాబ్‌కార్డులు ఉండగా 11,542 మంది కూలీలు ఉన్నారు. వారికి రైతు పొలాల్లో అభివృద్ధి పనులు, కందకాల తవ్వకం, పండ్ల తోటల పెంపకం తదితర 1,685 పనులు కల్పించనున్నారు. 3.34 లక్షల పనిదినాలను పూర్తి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి కూలీల్లో చైతన్యం తీసుకురానున్నట్టు పేర్కొన్నారు.

లక్ష్యం అధిగమిస్తాం

మండలంలోని 6,998 జాబ్‌కార్డుల్లో ఎక్కువ మంది కూలీలకు పని కల్పిస్తాం. ఇప్పటికే 1,685 పనులు గుర్తించాం. 3.34 లక్షల పనిదినాలకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ మేరకు కూలీలతో పనులు చేయించడానికి గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి అవగాహన తీసుకొస్తాం. వేసవిలో కూలీలకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తాం. జాబ్‌కార్డు లేనివారందరికీ మంజూరు చేస్తాం. వీలైనంత మందికి పని కల్పిస్తాం. –ఆశారాణి ఏపీవో, ఎర్రావారిపాళెం

- గ్రామ పంచాయతీలు – 12
- జాబ్ కార్డులు – 6,998
- కూలీల సంఖ్య – 11,542
- 2022–23లో వంద రోజులు పూర్తయిన వారు – 656
- 2022–23లో చేపట్టిన పనులు –232
- 2022–23లో ఖర్చు చేసిన నిధులు – రూ.9 కోట్లు
- 2022–23లో లబ్ధిపొందిన కూలీల సంఖ్య – 5253
- 2022–23లో లబ్ధిపొందిన రైతులు – 335
- 2023–24కి మంజూరైన పనుల సంఖ్య – 1685
- 2023–24లో ప్రణాళిక బడ్జెట్ – 3.34 లక్షల పనిదినాలు

ఇంద్రియాల నిగ్రహంతోనే లక్ష్య సాధన



మాట్లాడుతున్న గౌరవ్‌దర్శన్ దాస్

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంద్రియాల నిగ్రహంతోనే లక్ష్యాన్ని సాధించవచ్చని ముంబయికి చెందిన భక్తి వేదాంత విద్యాపీఠ డీన్ గౌరవ్‌దర్శన్ దాస్ తెలిపారు. మహిళా వర్సిటీలో బుధవారం స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఫ్రం డిస్ట్రక్షన్ టు కాన్సంట్రేషన్ అన్న అంశంపై ప్రేరణ తరగతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యాచరణపై పూర్తి శ్రద్ధ చూపకుంటే లక్ష్యాన్ని అధిగమించలేరని పేర్కొన్నారు. అనుకూలత లేని మల్టీ టాస్కింగ్ ఆశించిన ఫలితాలు ఇవ్వదని తెలిపారు. పంచేంద్రియాలు మనసును పరిపరి విధాలుగా ఆలోచించేలా చేస్తాయని, మేధస్సు ద్వారా ఇంద్రియ నిగ్రహం సాధించి సరైన దిశగా సాగాలని సూచించారు. మేధాశక్తిని పెంపొందించుకోవడం ద్వారా పరధ్యానాన్ని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ శారద, మహిళా అధ్యయన విభాగాధిపతి నీరజ, ప్రొఫెసర్ అనురాధ, నిర్మల పాల్గొన్నారు.

నేడు రాజమాతకు సనాతన ధర్మ భారతి పురస్కారం



సభపై చర్చిస్తున్న గజల్ శ్రీనివాస్, తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సేవ్ టెంపుల్ భారత్, వేద విజ్ఞాన సమితి సంయుక్తంగా గురువారం సాయంత్రం 5 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో రాజమాత తీరునల్ గౌరీ లక్ష్మీబాయికి సనాతన ధర్మ భారతి స్ఫూర్తి పురస్కారం అందజేయనున్నట్టు నిర్వాహకుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం తిరుపతి సమాజ కార్యాలయాన్ని సందర్శించి పురస్కార ప్రదాన సభ గురించి చర్చించారు. ఇందులో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర స్వామి, ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొంటారని తిరుపతి బ్రాహ్మణ సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీమాస్ అశోక్, కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం నేతలు వెంకట పెరుమాళ్, వేదం హరిప్రసాద్, కొత్తపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న మరో లారీ



లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన సుబ్రమణ్యం

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని నూర్ జంక్షన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున లారీని మరో లారీ ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురానికి చెందిన హనుమంతరెడ్డి లారీలో వెంకటగిరి నుంచి కర్ణాటకలోని తుంకూర్‌కు ధాన్యం తీసుకుని బయలుదేరాడు. చంద్రగిరి సమీపంలోని నూర్ జంక్షన్ వద్ద అగ్రికల్చర్ చెక్ పోస్టు సిబ్బంది లారీని నిలిపారు. అదే సమయంలో తమిళనాడు నామక్కల్‌కు చెందిన డ్రైవరు సుబ్రమణ్యం శ్రీకాళహస్తి నుంచి మదురైకి ప్లైవుడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. డ్రైవరు సుబ్రమణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు అక్కడికి చేరుకుని సుబ్రమణ్యంను బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి కూలీకి గిట్టుబాటు వేతనం



పంటను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

రామచంద్రాపురం: ప్రతి కూలీకి గిట్టుబాటు వేతనం కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం ఉపాధి హామీ పథకం కింద గంగిరెడ్డిపల్లిలోని రైతు అనురాధ పొలంలో చేస్తున్న మామిడి మొక్కల నాటే పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1,086 కుటుంబాలు వంద రోజుల పనులు పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.257 కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. పని ప్రదేశంలో ఫొటోలు తీసి ప్రతిరోజూ ఎస్ఎంఎస్ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ హంసవేణి, జూనియర్ ఇంజినీర్ మమత, టెక్నికల్ అసిస్టెంట్లు సుదర్శన్, రమేష్, క్షేత్ర సహాయకులు వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పయాగం



శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్పురంలో వెలసిన టీటీడీ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున వేద పండితులు స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా ఫల, పుష్ప, సుగంధ, పన్నీటి సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం చేశారు. అనంతరం వివిధ కనుల పండువగా పుష్పయాగం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

తెల్లవారకనే పింఛను పంపిణీ



33వ డివిజన్‌లో పింఛను అందజేస్తున్న శివశంకర్‌రెడ్డి, తిరుపతి జేసీఎస్ నాయకులు

తిరుపతి మంగళం: గతంలో ఎన్నడూ లేని విధంగా 1వ తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారులకు ముంగిటకే సచివాలయ వలంటీర్లు, కన్వీనర్లు, జేసీఎస్ అధ్యక్షులు పింఛను అందజేస్తున్నట్టు జేసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం 33వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో తమకు పింఛను రాలేదు అనే వారే లేకుండా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అర్హులందరికీ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసు కుని పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వార్డు కన్వీనర్లు, జేసీఎస్ అధ్యక్షులు, గృహసారథులను నియమించారని గుర్తు చేశారు. జేసీఎస్ తిరుపతి అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, తిరుపతి జిల్లా సోషల్ మీడియా కో–కన్వీనర్ మైలం శ్రీకాంత్‌రెడ్డి, సూరి, సుభాస్ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో బుధవారం సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తిరుపతి టాటా ట్రస్ట్ వైద్య సిబ్బంది ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, దంత వైద్య పరీక్షలు చేశారు. గుడిమల్లం, ఎస్సీ కాలనీ, మిట్టమీదకండ్రిగ, ఎస్టీ కాలనీ తదితర గ్రామాల నుంచి వచ్చిన 90 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవగాహనతో క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. టాటా ట్రస్ట్, పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్షలో వివేకా కోచింగ్ సెంటర్ ప్రభంజనం

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఫిబ్రవరి 19న నిర్వహించిన ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్షల్లో వివేకానంద కోచింగ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎ.శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో 200 మార్కులకు ఎ.లోకేష్‌కుమార్ 126, బి.వెంకటేష్ 113, డి.పవన్‌కుమార్ 111 మార్కులు సాధించారని పేర్కొన్నారు. వీరితో పాటు 45 మందికి పైగా విద్యార్థులు పరీక్షల్లో అర్హత సాధించినట్టు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

నరేష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



నరేష్ భార్య పావనికి నగదు అందజేస్తున్న వార్డు సెక్రటరీలు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని 38వ డివిజన్ సింగాలగుంటకు చెందిన నరేష్‌కుమార్ సోమవారం మృతిచెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం వర్తించింది. వారికి తక్షణ సాయం కింద రూ.10 వేలను కార్పొరేటర్ నరేంద్రనాథ్ సహకారంతో వార్డు అడ్మిన్, వెల్ఫేర్ సెక్రటరీలు సతీష్, నీలామణి మృతుడు నరేష్ భార్య ఎం.పావనికి అందజేశారు.

పోకలను కలిసిన ఎమ్మెల్సీ సిపాయి



పోకల అశోక్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి మంగళం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



ఎస్వీయూలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కార్పొరేటర్లు

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపిస్తాయని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం మేయర్ శిరీషతో కలిసి ఎస్వీయూలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తే ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. తిరుపతిలో ఓటు శాతాన్ని పెంచి అభ్యర్థుల గెలుపుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరేంద్ర, యూనివర్సిటీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమనకు సత్కారం

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ కె.రమేష్, బుధవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని పద్మావతిపురంలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట డాక్టర్లు మునిశేఖర్, హేమకుమార్, హరిబాబు ఉన్నారు. వారు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

ఉమాకాంత్‌రెడ్డికి ఎమ్మెల్యే నివాళి



ఉమాకాంత్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల: మండలంలోని పెదబైనపల్లి పంచాయతీ దాసర్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కత్తి ఉమాకాంత్‌రెడ్డి(41) ఇటీవల మృతి చెందారు. బుధవారం కర్మ క్రియలు నిర్వహించారు. ఇందులో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొని ఉమాకాంత్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైస్ ఎంపీపీ చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, హరికృష్ణారెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి, సునీల్, విక్రమ్ పాల్గొన్నారు.



మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిశీలన

తిరుపతి నగరంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి బుధవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్పొరేటర్ అమర్నాథ్ రెడ్డి, పులిగోరు ప్రభాకర్ రెడ్డి, పులికంటి గోపీనాథ్ రెడ్డి, డీపీఆర్ మురళి, మార్కెట్ వంశీ, ఉదయ్ వంశీ, ఇరగం అనిల్ రెడ్డి, సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

9 నుంచి పేరూరు ధర్మరాజుల గుడి మహాకుంభాభిషేకం

తిరుపతి రూరల్: పేరూరులోని శ్రీకృష్ణ ద్రౌపది ధర్మరాజులస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, అష్టబంధన మహాకుంభాభిషేక ఉత్సవాలను 9 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కోశాధికారులు తులసిసాయి కృష్ణారెడ్డి, మూలం సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు అనుజ్ఞ, గణపతి హోమం, గోపూజ, దీపారాధన, సాయంత్రం వాస్తుశాంతి, మృత్సంగ్రహణం, అంకురార్పణం, రక్షాబంధనం, పూర్ణాహుతి, మహా దీపారాధన, 10న యాగశాల రెండో కాలపు పూజ, హోమం, మహా పూర్ణాహుతి, ఆలయ ప్రదక్షణం, విమాణ గోపుర కుంభాభిషేకం, మాతాలయ శ్రీకృష్ణ ద్రౌపది సమేత పంచపాండవ స్వామి వారికి మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి



పెళ్లి కానుక అందజేస్తున్న సర్పంచ్ కళావతి

చంద్రగిరి: మండలంలోని రాయపురం పంచాయతీకి చెందిన రాజశేఖర్, వరలక్ష్మీ, బుచ్చినాయుడుపల్లి పంచాయతీకి చెందిన తేజ కుమార్, నందినికి వివాహం నిశ్చయమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పసల నాగరాజు, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అందజేశారు. సర్పంచులు వెంకటయ్య, రవినాయుడు, బుజ్జిబాబు, సతీష్, నీలావతి, ఆనందయ్య, హరి, వాసు పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ బార్లీకొండ బంగ్లా గ్రామంలో పెళ్లి చేసుకోబోతున్న వధూవరులు కె.మౌనిక, పి.సుధీర్‌కుమార్‌కు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం స్థానిక సర్పంచ్ పూతలపట్టు కళావతి అందజేశారు.